ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

జిల్లా వార్తలు

5

శనివారం 10 ఫిబ్రవరి 2024

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9: జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పీఆర్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1971 ఫిబ్రవరి 9న ఐదుగురు సభ్యులతో సామల యాదగిరి ప్రారంభించిన ఉపాధ్యాయ సంఘం, ఈరోజు 75వేల సభ్యులతో దేశంలోనే అగ్రగామిగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డితోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

జడ్పీ సమావేశం వాయిదా

- గైర్హాజరైన సభ్యులు



జడ్పీ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9: ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి వేదికగా నిలిచే జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయగా సభ్యులు ఎవరూ కూడా హాజరుకాలేదు. నిబంధనల మేరకు జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని 90 రోజుల్లో విధిగా నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలు, సభ్యులకు, అధికారులకు సమాచారమిచ్చారు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాల తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. సభ్యులెవరు కూడా హాజరు కాక పోవడంతో సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ప్రకటించారు. 15 రోజుల్లో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సమావేశానికి ఆహ్వానిస్తామని చెప్పారు. వేసవికి ప్రారంభానికి ముందే జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రైతులు సాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సాగు, తాగునీటి ఇబ్బందులతోపాటు ఇతర ప్రజా సమస్యలపై అధికారులతో తానే చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చైర్‌పర్సన్ విజయ మీడియాకు వెల్లడించారు. జూన్‌తో ప్రస్తుత జడ్పీ పాలకవర్గ పదవీకాలం ముగియనుంది.

నేటి నుంచి 'బండి' ప్రజాహిత యాత్ర

- ఆరు రోజులు.... 119 కిలో మీటర్లు
- తొలి విడతలో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ శనివారం ప్రజాహిత యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మండల కేంద్రాలు, ముఖ్య గ్రామాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు కలిసివచ్చేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకొని ప్రజల్లోకి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలలోనే వెలువడనున్నదని వార్తలు వస్తున్న నేపథ్యంలో బండి సంజయ్ ప్రజాహిత యాత్ర ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు సైతం అయోధ్య అక్షింతలు అందజేశారు. నాలుగు లక్షల కుటుంబాలకు అయోధ్య రామాలయ ఫొటోల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయోధ్య రామ విగ్రహ ప్రతిష్ఠ అంశాన్ని పల్లెపల్లెకు తీసుకవెళ్లి సెంటిమెంట్‌తో ప్రజలకు దగ్గర కావడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. అక్కడితో ఆగకుండా నియోజకవర్గ పరిధిలో ప్రజలను కలవడానికి గావ్ చలో యాత్రను చేపట్టాలని నిర్ణయించి అమలు చేస్తున్నది.

● కొండగట్టులో పూజలు చేసి..

శనివారం ఉదయం ఆయన కరీంనగర్‌లోని మహాశక్తి దేవాలయంలో పూజలు నిర్వహించి కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లి అక్కడ కూడా ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మేడిపల్లి మండల కేంద్రం నుంచి వేములవాడ నియోజకవర్గ ప్రజాహిత యాత్రను ప్రారంభిస్తారు. మేడిపల్లిలో బహిరంగ సభను నిర్వహించి అక్కడ నుంచి కొండాపూర్, రంగాపూర్, బీమారం, మన్నెగూడం, బొమెన, తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల మీదుగా యాత్ర సాగుతుంది. సిరికొండ గ్రామంలో నిద్రిస్తారు. రెండో రోజైన ఆదివారం కథలాపూర్ మండలంలోని కథలాపూర్, దూమ్‌పేట, పోసానిపేట, తాండ్రియాల్, ఇప్పలపల్లి, అంబారీపేట, కలికోట, కలికోట తండా, రుద్రంగి మండలంలోని రుద్రంగి, చందుర్తి మండలం లింగంపేట, కట్ట లింగంపేట, మల్యాల, చందుర్తి, రామన్నపేట, తిమ్మాపూర్, నర్సింగాపూర్ వరకు వెళతారు. అక్కడ రాత్రి బస చేస్తారు. మిగతా నాలుగు రోజులు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోనే ఆయన యాత్ర కొనసాగుతుంది. ఈ యాత్రలో జిల్లాకు సంబంధించిన నాయకులతోపాటు సంజయ్‌కుమార్‌కు మద్దతుగా పలువురు రాష్ట్ర నాయకులు హాజరయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

● ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు

రాష్ట్రంలో ప్రథమంగా బండి సంజయ్‌కుమార్ తన నియోజకవర్గ పరిధిలో ప్రజాహిత యాత్రను ప్రారంభిస్తున్నారు. అన్ని గ్రామాల్లో గడిచిన ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేసిన కార్యక్రమాలు, ఆ గ్రామానికి అందిన అభివృద్ధి నిధులు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాల ఫలాలను వివరిస్తూ ఎక్కడికక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. బండి సంజయ్‌కుమార్ ఈనెల 10 నుంచి 15 వరకు తొలి విడతలో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో 119 కిలోమీటర్ల యాత్రను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

మీకోసం యాత్రనై వస్తున్నా.... ఆశీర్వదించండి

- ప్రజలకు బండి సంజయ్‌కుమార్ బహిరంగ లేఖ

ప్రజాహిత యాత్రను ప్రారంభిస్తున్న సందర్భంగా సంజయ్‌కుమార్ నియోజకవర్గ ప్రజలకు బహిరంగ లేఖను విడుదల చేశారు. గల్లీలో ఎవరున్నా దేశ రక్షణ కోసం ఢిల్లీలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉండాలని యావత్ భారత్ దేశం కోరుకుంటున్నదని ఆయన తెలిపారు. దేశహితం కోసం, రాష్ట్ర హితం కోసం, కరీంనగర్ ప్రజల హితం కోసం కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా ప్రజాహిత యాత్రనై మీముందుకు వస్తున్నా.. మోదీ ప్రభుత్వానికి నా కరీంనగర్ బలగం అండగా ఉందని చాటిచెప్పడానికి మీ ఆశీర్వాదం కోరుతూ పల్లెకు, ప్రతి గడపకు మీ బిడ్డనై వస్తున్నా.. ఆశీర్వదించండి అని కోరారు. ప్రతిపక్షాలు తనపై చేస్తున్న నిరాధారమైన ఆరోపణ చేస్తున్నాయన్నారు. తాను నియోజకవర్గ అభివృద్ధికి తీసుకొచ్చిన నిధులు, తన హయాంలో చేసిన అభివృద్ధి పనులను ఆయన లేఖలో తెలిపారు.

బధిరుల ప్రతిభను ప్రపంచానికి చాటాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



కొలిమికుంటలో అంగన్‌వాడీ పిల్లలతో కలెక్టర్ పమేలా సత్పతి


కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9: అద్భుతమైన విజయాలను సొంతం చేసుకోగల బధిరుల ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్నేహిత కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బధిరుల పాఠశాలలో స్నేహిత కార్యక్రమంలో పాల్గొనడం ఎక్కువ సంతోషాన్ని ఇచ్చిందని కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, విద్య ప్రాముఖ్యం, పాఠశాల వద్ద లేదా ఇంటి వద్ద ఎవరివల్లనైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని తల్లిదండ్రులకు లేదా టీచర్లకు చెప్పేలా పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. గతంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, చెస్ పోటీల్లో పాల్గొన్న అంధులను చూడగానే ఎంతో అద్భుతంగా అనిపించిందన్నారు. జిల్లాలోని బధిరుల పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. విద్యార్థులు అనారోగ్యం బారినపడకుండా ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, పరిశుభ్రతను పాటించడం, ఉతికిన బట్టలు వేసుకోవడం వంటి వాటిని పాటించాలని సూచించారు. విద్యలోనే కాదు ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలమనడానికి నిదర్శనమే నేటి బధిరుల పాఠశాల విద్యార్థులని, వీరు ఎందరికో ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. అంతకుముందు బధిరుల విద్యార్థులు కాగితాలతో చేసిన పూల బొకేలను, పేపర్‌పై గీసిన కలెక్టర్ చిత్రాన్ని కలెక్టర్‌కు బహూకరించారు. ముంబాయిలో జరిగిన సైరో ఒలింపిక్స్‌లో పాల్గొని బహుమతులను సాధించిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, మార్కెటింగ్ డీడీ పద్మావతి, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సీడబ్ల్యూసీ ధనలక్ష్మి, డాక్టర్ నజియా ఫాతిమా, పీటీం సీఐ శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

● పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

చొప్పదండి: పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రుక్మాపూర్, కొలిమికుంటలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా కలెక్టర్ నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రత్యేకాధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రతిరోజు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్డీవో శ్రీలత, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వచ్చేనా?

- ఆశగా ఎదురు చూస్తున్న మాజీ సర్పంచ్‌లు



హుజూరాబాద్, ఫిబ్రవరి 8: గ్రామాల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు కొన్నేళ్లుగా రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఇబ్బంది పడుతున్నారు. ఈ పెండింగ్ బిల్లులు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా ఇస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ఒకొక్క గ్రామపంచాయతీకి ఐదు లక్షల నుంచి 15 లక్షల రూపాయల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల పల్లె ప్రగతి నిధులతో పాటు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తున్నాయి. ఆ నిధులు సిబ్బంది జీతాలు, ఇతర అవసరాలకే సరిపోతున్నాయి. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు అప్పులు తెచ్చి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు గడువులోగా పనులు పూర్తి చేసిన అప్పటి సర్పంచ్‌లు బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. పల్లె ప్రకృతి వనాలు, విద్యుత్, పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణ, పారిశుధ్య అమలు, తాగునీరు పైపులైన్ల మరమ్మతులు, క్రీడా ప్రాంగణాలతో పాటు ఇతర అత్యవసరాలకు పెట్టిన ఖర్చులు ఏడాదిన్నరగా రాలేదు. ఈలోగానే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామపంచాయతీలు నడుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం తమను ఆదుకొని బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



- వింగి కరుణాకర్, మాజీ సర్పంచ్, రంగాపూర్

గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం పెట్టిన డబ్బులు కొత్త ప్రభుత్వం ఇప్పించాలి. అభివృద్ధి పనులు చేసిన వెంటనే నిధులు మంజూరవుతాయని భావించి అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశాం. ప్రభుత్వం నుంచి నాకు 25 లక్షల రూపాయల వరకు డబ్బులు రావాలి. ఈ బిల్లుల కోసం రోజు ఎదురుచూస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇప్పించాలి.

తెలంగాణ చిహ్నాన్ని మార్చితే ఊరుకోం..

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9: తెలంగాణ చిహ్నంలో మార్పులు చేస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదని, తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. శుక్రవారం రాత్రి నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ చిహ్నంలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయ తోరణం, చార్మినార్ ఉన్నాయన్నారు. కేబినెట్‌లో తీర్మానం చేసి చిహ్నాన్ని మార్చుతామని అన్నారన్నారు. 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రాన్ని భివృద్ధిలో అగ్రగామిగా కేసీఆర్ నిలిపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ చిహ్నాన్ని మార్పులు చేస్తే సహించేది లేదని వినోద్‌కుమార్ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సీమాంధ్ర పాలకుల ఫైకంలో ఉన్నారనే విషయం అర్థమవుతుందన్నారు. సీఎం తెలంగాణ తల్లి విగ్రహంలోనూ మార్పులు చేస్తామని మాట్లాడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పేర్లు మార్చడం కాదు.. మీరు ప్రజలకు ఏమి చేయబోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిద్ధం వేణు, గంగాధర ఎంపీపీ శ్రీరాంమధు, జక్కుల నాగరాజుయాదవ్, ద్యావ మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రవీణ్‌రెడ్డి, శ్రావణ్, ఓంకార్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యలయం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వకుండా అనేక పనులకు వారిని ఉపయోగించుకుంటుందన్నారు. తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ అందించేందుకు అర్హులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగించిందన్నారు. దీంతో వారిపై భారం పడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతినెల 5వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు సత్యం, సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగవేణి శారద, ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, ఉపాధ్యక్షురాలు పద్మ, శోభ, శంకరమ్మ, సరిత, సహాయ కార్యదర్శి శ్యామల, సదాలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న అరెస్టులు

భూకబ్జా కేసులో ఇద్దరు కార్పొరేటర్ల భర్తలు, మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: కరీంనగర్‌లో గత ప్రభుత్వ హయాంలో భూ కబ్జాలకు పాల్పడిన వారి అరెస్టులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే భూకబ్జా కేసుల్లో ఇద్దరు కార్పొరేటర్లు, మాజీ ఎంపీటీసీ, మాజీ ఆర్టీఏ మెంబర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకుడు, మరొకరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా కరీంనగర్ 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుదగోని కృష్ణగౌడ్ అలియాస్ లడ్డు, 17వ డివిజన్ కార్పొరేటర్ కోల ప్రశాంత్, రియల్ ఎస్టేట్ వ్యాపారి మల్యాల మండలం రామన్నపేటకు చెందిన ఏలేటి భరత్‌రెడ్డిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వారిని కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. ముగ్గురు నిందితులను జిల్లా జైలుకు తరలించారు.



నిందుతులను జైలుకు తీసుకెళుతున్న పోలీసులు

పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడకు చెందిన గునుకుల రాజిరెడ్డి 2014 సంవత్సరంలో కమాన్‌పూర్‌కు చెందిన పంజాల శ్రీనివాస్ ద్వారా సుదగోని కృష్ణగౌడ్‌కు పరిచయం ఏర్పడింది. రేకుర్తి శివారులో సర్వే నంబరు 119లో 25 గుంటల భూమి 100 అడుగుల రోడ్డుకు ఆనుకుని ఉంటుందని చెప్పి నమ్మించి జక్కుల మల్లేశంతో కలిసి సుదగోని కృష్ణగౌడ్ గుంటకు ఆరు లక్షల రూపాయల చొప్పున రాజిరెడ్డి వద్ద 31 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. ఈ భూమిలోకి రాజిరెడ్డి వెళ్లగా ఇతరులు భూమి మాదేనంటూ అతడితో గొడవకు దిగారు. దీంతో ఆ భూమికి బదులుగా సర్వే నంబరు 79బిలో 20 గుంటల భూమి ఉందని, ఆ భూమి గుంటకు 9 లక్షల వంతున 2016 జూలై 1న రాజిరెడ్డితో సేల్ అగ్రిమెంట్ డీడ్ చేసుకున్నారు. ఇందుకుగాను రాజిరెడ్డి 76 లక్షలు సుదగోని కృష్ణగౌడ్‌కు చెల్లించాడు. కంకణాల భాగ్యలక్ష్మి, కంకణా సుజాత పేరిట ఉన్న 700 చదరపు గజాల భూమిని రాజిరెడ్డి సోదరుడు సంపత్‌కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. మిగతా భూమిని రిజిస్ట్రేషన్ చేయించమని కోరగా వడ్డేపల్లి కరుణాదేవి భర్త రాజయ్య పేరిట ఉన్న 1210 చదరపు గజాల భూమిని 2017 ఫిబ్రవరి 14న సంపత్‌కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. డాక్యుమెంట్లు పరిశీలించగా ఈ భూమి తగాదాలో ఉన్నట్లు తెలిసింది. తన వద్ద తీసుకున్న డబ్బులకు వివాదం లేని భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా సుదగోని కృష్ణగౌడ్ దాటవేశాడు. రాజిరెడ్డిని ఒకరోజు కృష్ణగౌడ్ రేకుర్తిలోని తన కార్యాలయానికి పిలిచి కోలప్రశాంత్ ఈ వివాదం పరిష్కరిస్తాడని చెప్పడంతో 2021 జూలై 6న కోల ప్రశాంత్‌కు 20 లక్షల రూపాయలు రాజిరెడ్డి ఇచ్చాడు. రిజిస్ట్రేషన్ చేయాలని ఎన్నిసార్లు కోరినా మరో 30 లక్షలు ఇస్తేనే భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని, లేదంటే చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. కృష్ణగౌడ్, కోల ప్రశాంత్ తన వద్ద కోటి 37 లక్షలు తీసుకుని మోసం చేశారని శుక్రవారం కొత్తపల్లి పోలీసులకు రాజిరెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

● సూత్రధారిపై బిగిస్తున్న ఉచ్చు

భూ కబ్జాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, సెటిల్‌మెంట్లు తదితర అక్రమ దందాలకు సూత్రధారిగా నిలిచి అంతాతానై నడిపించిన కీలక వ్యక్తిపై పోలీసులు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. భూకబ్జాలు, ఇతర అక్రమ దందాలతోపాటు ఆర్థిక నేరాలకు సంబంధించి ఇప్పటి వరకు 750కు పైగా ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 70 శాతం వరకు భూకబ్జాలవే ఉన్నాయి. బాధితులందరితో సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడి వారికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకుంటున్నారు. ఎక్కడ అన్యాయం జరిగింది, ఎవరు దీనికి కారణం, ఈ అక్రమదందా వెనుక ఎవరున్నారనేది బాధితుల నుంచి రాబట్టే క్రమంలో తెరవెనుక ఉన్న ఒకే ఒక వ్యక్తి పేరు బయటకు వస్తున్నట్లు సమాచారం. ఆ వ్యక్తి నేరుగా భూకబ్జాలకు పాల్పడకుండా కొందరు బినామీలతో చేయించినట్లు ఫిర్యాదుదారులు, కొందరు నిందితులు విచారణ సమయంలో తమ వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు తెరచాటుగా ఉండి లాండ్ మాఫియాను నడిపిస్తున్న వ్యక్తి, ఆ వ్యక్తికి అండదండలు అందించిన నేతలను పోలీసు అధికారులు ఇప్పటికే గుర్తించినట్లు తెలిసింది. ఆ వ్యక్తులపై పకడ్బందీగా కేసులు నమోదు చేసి అరెస్టు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమదందాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలంటే మూలాలలోకి వెళ్లి కీలక సూత్రధారులను కటకటాల్లోకి పంపించాలని సీపీ భావిస్తున్నట్లు సమాచారం. భూకబ్జాలు, ఇతర మోసాలపై సీపీకి రోజుకు 50 మంది ఫిర్యాదు చేస్తుండడం చూస్తే కరీంనగర్‌లో ల్యాండ్ మాఫియా, అక్రమదందాలు ఏ స్థాయిలో జరిగాయనేది విస్మయం కలిగిస్తున్నది. విచ్చల విడిగా భూకబ్జాలు జరిగినా అధికారులు పట్టించుకోకపోగా



ఫిర్యాదుదారుడైన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి రాజిరెడ్డిపైనే మూడు కేసులు నమోదు చేయడం మాఫియా సాగించిన విచ్చలవిడితనానికి నిదర్శనమనే విమర్శలు వస్తున్నాయి. మాఫియా ఆగడాలు కొందరు పోలీసుల అండతోనే సాగాయని విమర్శలు వస్తు న్నాయి. ఈ భూ కబ్జాలు, అక్రమదం దాలతో ప్రమేయం ఉన్న ప్రభుత్వ శాఖల ఉద్యోగులపై చర్యలు తీసుకునే విషయంపై సీపీ దృష్టి సారించినట్లు సమాచారం. వరుసగా కార్పొరేటర్లు, కార్పొరేటర్ల భర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను అరెస్టు చేసి, జైలులో పంపిస్తుడడంతో చాలా మంది కార్పొరేటర్లు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపున అక్రమార్కులు కాళ్ల బేరానికి వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సీపీకి ఫిర్యాదు చేసిన వారు, ఫిర్యాదుకు సిద్ధమవుతున్న వారితో మధ్యవర్తులు, దగ్గరి బంధువులతో రాయబారం నడుపుతూ రాజీ కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. నేరం చేసిన ఘటనలో ఎవరినీ వదలబోమని పోలీసులు చెబుతున్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన వారిపై కేసు

కొడిమ్యాల, ఫిబ్రవరి 9: అదనపు కట్నం కావాలంటూ నిత్యం వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కొడిమ్యాల హెడ్‌కానిస్టేబుల్ అర్జరాజు శనివారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన లావణ్యకు సిరిసిల్ల పట్టణానికి చెందిన పల్లెపు కుమార్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నంగా ఐదు తులాల బంగారు నగలు, ద్విచక్ర వాహనం అందించారు.

వీరికి ఒక కూతురు జన్మించింది. రెండు సంవత్సరాల నుంచి లావణ్యను రెండు లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకరావాలని భర్త పల్లెపు కుమార్, అత్తమామ, ముగ్గురు ఆడపడుచులు, మానసికంగా వేధిస్తున్నారంటూ లావణ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: మంకమ్మతోటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళను అరెస్టు చేశామని రెండో టౌణా సీఐ వెంకటేష్ తెలిపారు. విటుడు రాజు, యువతులను తీసుకువస్తున్న వ్యక్తి ప్రశాం త్, ఇంటి యజమాని రూప్‌సింగ్‌లపై కేసు నమోదు చేవామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9 : సప్తగిరి కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను శుక్రవారం అరెస్టు చేశామని రెండో టౌణా సీఐ వెంకటేశ్ తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 36,070 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కాలువలోపడి యువకుడి గల్లంతు

చొప్పదండి, ఫిబ్రవరి 9: చొప్పదండి పట్టణ శివారులోని డి-86 కాలువలో పడి యువకుడు గల్లంతు అయినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. షేక్ యూసుఫ్(25) బంధువుతో కలిసి శుక్రవారం సాయంత్రం చిల్లవాడ సమీపంలో డి-86 కాలువ మెట్ల వద్ద స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో నాటిలో గల్లంతు అయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి బి. ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయబద్ధమైన విధులను విస్మరించి, అనభ్యంగా ప్రవర్తించడం, అసభ్య పదజాలం ఉపయోగించడం, ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించినందుకు గాను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంథని నుంచే పీవీ రాజకీయ ప్రస్థానం

- 1957 నుంచి నాలుగుసార్లు మంథని ఎమ్మెల్యేగా వరుస విజయాలు - ఉమ్మడి ఏపీలో వివిధ శాఖల మంత్రిగా, సీఎంగా సేవలు- పీవీకి భారతరత్న ప్రకటించిన కేంద్రప్రభుత్వం



మంథని, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు మంథని నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం దేశంలో అత్యున్నమైన భారతరత్న అవార్డును ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం మంథని ప్రాంత వాసులు, రాజకీయ పార్టీల నేతలు మంథని తో పీవీకి ఉన్న అనుబంధాన్ని మరో మారు నెమరువేసుకున్నారు. 20 ఏళ్లపాటు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష పార్టీల నేతలు, అధికారులతో కలిసిమెలిసి మంథనిలో పీవీ నర్సింహారావు రాజకీయ కార్యకలాపాలు కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు 1957లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీవీ నర్సింహారావు పోటీచేసి ఘనవిజయ సాధిం చి తన రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనతరం జరిగిన 1962, 1967, 1972 శాసనసభ ఎన్నికల్లో మంథని నుంచి వరుసగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీవీ గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖల మంత్రిగా, కొద్దినెలల పాటు సీఎంగా సేవలందించారు. అనంతరం ఎంపీగా పోటీచేసి దేశ రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. పలుమార్లు ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా, ప్రధానమంత్రిగా పనిచేసి ప్రజాపాల నలో తన రాజకీయ చతురతను చాటుకున్నారు. మంథని పట్టణానికి విద్యుత్ కల్పన, గోదావరినది నుంచి తాగునీరు అందించడానికి పైప్‌లైన్, నల్లా కనెక్షన్లు, బొక్కలవాగుపై వంతె న నిర్మాణం, అడవిసోమన్‌పల్లి వద్ద మానేరు నది భారీ వంతెన నిర్మాణం తోపాటు అనేక రోడ్లు, విద్యా, వైద్య సేవలను విస్తరించడానికి పీవీ ఎనలేని కృషి చేశారు.

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమ యంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మంథని పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో పీవీ నర్సింహారావు విగ్రహాన్ని ఏర్పాటు ప్రతిష్ఠించి ఘనంగా ఆవిష్కరించారు. పీవీ నర్సింహా రావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జడ్పీ చైర్మన్ పుట్ట మధు, కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం వేర్వేరుగా హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పీవీ విగ్రహానికి బెజ్జంకి డిగంబర్, మేడగోని రాజమౌళిగౌడ్, రామడుగు మారుతి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నాటి 'రాజన్న' ధర్మకర్తకు భారతరత్న

వేములవాడ: ఒకప్పుడు వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తగా సేవలందించిన దివంగత మాజీ ప్రధాని పాముల పర్తి వెంకట నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యున్నత మైన భారతరత్న పురస్కారం ప్రకటించడంపై వేములవాడ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తగా ఈ ప్రాంతంతో అనుబంధం కలిగి ఉన్నాడు. 1956లో అప్పటి రాజన్న ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు రేగులపాటి అనంత రావుతో పాటు రాజన్న ఆలయ ట్రస్ట్ సభ్యులుగా పీవీ నరసింహారావు కొనసాగారు. 1990లలో వేములవాడ రాజన్న దర్శనానికి కూడా వచ్చారు. అప్పటి ఎంపీ చొక్కారావు ఈ సందర్భంగా పీవీ నరసింహారావును రాజన్న ఆలయంలో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. పీవీ నరసింహారావు కు భారతరత్న పురస్కారం ప్రకటించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, విశ్వహిందూ పరిషత్ నాయకుడు డాక్టర్ మధు రాధాకిషన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జయహో పీవీ.. భారతదేశపు లీవి

కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త పాములపర్తి వేంకట నరసింహారావును దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించగా కొందరు సాహితీవేత్తలు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



పీవీ నరసింహారావును సత్కరిస్తున్న నాటి ఎంపీ చొక్కారావు(ఫైల్)

● సముచిత గౌరవం దక్కింది

- డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, సాహితీవేత్త, అవధాని



పీవీకి సముచిత గౌరవం దక్కింది. యావత్ దక్షిణ భారతదేశంతో పాటు తెలుగువారందరూ గర్వించదగ్గ విషయం. ఆర్థికంగా దిగజారుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను తన మేధాశక్తితో పునరుద్ధరించిన గొప్ప రాజనీతిజ్ఞుడు. జాతిని నిద్ర లేపి పురోగమింపజేయడం నా కల అని జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన నిస్వార్థ రాజకీయ నాయకుడు. సాహితీవేత్తగా కూడా తగినంత గౌరవం లభించాల్సి ఉంది.

● అర్హత గల వ్యక్తుల్లో అగ్రగణ్యులు

- డాక్టర్ నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కరీంనగర్



పురస్కారానికి పీవీ సర్వ విధాల అర్హత గల వ్యక్తుల్లో అగ్రగణ్యుడు. భారతీయులు, తెలుగువారు మరచిపోలేని ఓ అరుదైన, అపూర్వ, మధుర ఘట్టం. కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన ఆయన ఘనత మరింత ఉన్నత శిఖరాలకు చేరింది. రాజనీతిజ్ఞత, భూ, ఆర్థిక సంస్కరణ లు, మాతృభాషా విద్యావిధానం వంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఆయన గొప్ప సృజనకారుడు. ఆయన రచనల్లో, అనువాదాల్లో అప్పుడే తెలంగాణ ముద్ర స్పష్టంగా కనిపించేది. గొల్ల రామవ్వ కథే కాకుండా ఆయన రాసిన హాస్య, వ్యంగ్య, రాజకీయ, అధిక్షేప నవల 'మంగయ్యగారి అదృష్టం'.

● పీవీ కుటుంబ సభ్యుడిగా గర్విస్తున్నా

-కేవీ సంతోష్‌బాబు, పీవీ సాహిత్యపీఠం అధ్యక్షుడు, కరీంనగర్



పీవీ తమ్ముడి అల్లుడిగా గర్విస్తున్నా. 2017లో పీవీ సాహిత్యపీఠం నెలకొల్పి ప్రతీ యేటా పురస్కారాలి స్తున్నాం. రచయితలకు కూడా ఎంతో గర్వకారణం.

● ఒక లోటు భర్తీ అయింది...

- వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కరీంనగర్



పీవీ తన జీవితంలో అందుకోని శిఖరాలు లేవు. భారతరత్న పురస్కారంతో ఒక లోటు భర్తీ అయింది. భాషా సాహిత్య పరంగా ఆయన సేవలు అమోఘం. నవీన ఆర్థిక వ్యవస్థలో ఆయన ఒక కొత్త ఒరవడి సృష్టించారు.

● పీవీకి భారతరత్న ఇవ్వడం భేష్..

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు రాజకీయాలకు అతీతంగా దేశానికి చేసిన సేవలను గుర్తించి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం అభినందనీయం. ఈ పురస్కారాన్ని అందించిన మోదీ ప్రభుత్వానికి ధన్యవాదాలు. తెలుగు ప్రజలకు ప్రత్యే కించి తెలంగాణకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. పీవీ నర్సింహారావును కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించింది. బీఆర్ఎస్ కేవలం రాజకీయ లబ్ధికే వాడుకున్నది.

● తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తెలంగాణ ముద్దుబిడ్డ, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం. గతంలోనే బీఆర్ఎస్ పార్టీ పీవీ నర్సింహారావుకు భారత రత్న ప్రకటించాలని డిమాండ్ చేసింది.

● జిల్లా వాసులకు గర్వకారణం..

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించడం హర్షణీయం. జిల్లా వాసులకు గర్వకారణం. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. మోదీ సర్కార్‌కు నగరప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నాం.

పీవీ పేరిట వెలిసిన ఓ గిరిజన గ్రామం

మంథని: చుట్టూ పరుచుకున్న పచ్చటి అడవి.. పక్కనే మానేరు జల తరంగాలు.. లోకం పోకడలు పెద్దగా తెలియని అమాయక గిరిజనులకు ఆవాస కేంద్రం.. వెరసి.. మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ నర్సింహారావు పేరిట ఓ గ్రామం ఆవిర్భవించింది. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని మల్హర్ మండలం కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలో పీవీనగర్‌ను దాదాపు 55 ఏళ్ళ క్రితమే గిరిజనులు ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా పున ర్విభజనలో భాగంగా ప్రస్తుతం మల్హర్ మండలం పరిపాలనపరంగా భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతోంది. పెద్దపల్లి-భూపాలపల్లి జిల్లాల సరి హద్దుగా ఉన్న మంథని-మల్హర్ మండలాల్లోని మానేరు నది ఒడ్డున గిరి జనులు పీవీనగర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పీవీ 1971లో మానేరు నదిపై భారీ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నియోజకవర్గంలో తొలి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మంథని పట్టణ శివారులోని బొక్కలవాగుపై సైతం వంతెన నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం సమయంలో తమకు చాలా కాలంపాటు ఉపాధి లభించడంతోపాటు తరుచూ మానేరునది వరదల ముంపుతో సతమతమైన అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన యాకపోడు అనే గిరిజన తెగకు చెందిన ప్రజలు ఆ బాధ లేకుండా ఉండటానికి బ్రిడ్జి అవతలి వైపు అనువుగా ఉన్న స్థలంలో నూత నంగా గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థలం రిజర్వు ఫారెస్టుది కావడంతో అటవీ శాఖ అధికారుల నుంచి ఇబ్బందులు లేకుండా పీవీ చొరవ తీసుకొని గిరిజనులు ఊరిని ఏర్పాటు చేసుకోవడానికి సహకరించారు. దీంతో గిరిజనులంతా ఆయన పేరిట పీవీ నగర్ నామకరణం చేసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో 52 యాకపోడు అనే గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. నాటి నుంచి పీవీ నగర్‌గా మంథని-కాటారం ప్రధాన రహదారి పక్కనే దర్శిమిస్తోంది.



పీవీ నగర్ విలేజ్ వ్యూ

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 9: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 13 నుంచి 16 వరకు జరగనున్న జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నగునూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 3,4 తేదీల్లో జిల్లా కేంద్రంలోని సప్తగిరి ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఇద్దరు క్రీడాకారులు డి.శృతి, టి. భానుప్రసాద్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి పతకాలతో తిరిగి రావాలన్నారు. కార్యక్రమంలో కేజీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత కక్షలతోనే హత్య

16 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

కోరుట్ల ఫిబ్రవరి 9 : కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం జరిగిన హత్య కేసును పోలీసులు 16 గంటల్లో ఛేదించారు. హత్యకు పాత కక్షలే కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. కోరుట్ల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంకటరమణ(55)కు కొద్ది రోజులుగా పాత కక్షలు ఉన్నాయి. దీంతో పాటు తన తల్లిపై అసభ్యంగా ప్రచారం చేస్తున్నాడని కొన్ని సార్లు వెంకటరమణతో రఘు గొడవ పడ్డాడు. పెద్దమనుషుల సమక్షంలో ఇదే విషయమై పలుసార్లు పంచాయితీలు జరిగినా వెంకటరమణ ప్రవర్తన మారలేదు. దీంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో రఘుపై తప్పుడు సమాచారం ఇచ్చి కేసు నమోదుకు వెంకటరమణ కారకుడయ్యాడు. అటు తల్లిపై అసభ్యంగా ప్రచారం చేయడంతో పాటు తనపై కేసు పెట్టించడంతో వెంకటరమణపై రఘు పగ పెంచుకుని హత్యకు వ్యూహం రచించాడు. ఈనెల 8వ తేదీన సాయంత్రం వెంకటరమణ కాలనీకి వచ్చి వెలుతున్న సమయంలో అక్కడే మాటు వేసి ఉన్న రఘు తన వెంట తెచ్చుకున్న కత్తితో వెంకటరమణపై దాడి చేసి హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. కాలనీవాసులు, మృతుడి భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు రఘు అర్బన్ కాలనీలోని తన ఇంటి వద్ద ఉన్నాడనే సమాచారంతో ఎస్సై కిరణ్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వాడిన కత్తితో పాటు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుళ్లు విజయ్, సతీష్‌లను సీఐ ప్రవీణ్ కుమార్ అభినందించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

చిన్నారి అపహరణకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 9: సిరిసిల్ల పట్టణంలోని ఓ పాఠశాల వద్ద మూడో తరగతి విద్యార్థినికి చాక్ లెట్ ఆశ చూపి అపహరించేందుకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశమని టౌన్ సీఐ రఘుపతి శుక్రవారం తెలిపారు.

పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఓ పాఠశాల వద్దకు వెళ్లిన ఆగంతకుడు ఎనిమిదేళ్ల బాలికకు చాక్ లెట్ ఇచ్చి అపహరించేందుకు యత్నించాడు. ఆగంతకుడి చేయి కొరికి బాలిక తప్పించుకుంది. అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా పరారయ్యాడు. పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు జాషువా ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని తెలిపారు.

మొలంగూర్ ఖిల్లాను అభివృద్ధి చేయాలి

శంకరపట్నం, ఫిబ్రవరి 9: శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లాను అభివృద్ధి పరచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జక్కని సంజయ్‌కుమార్ కేంద్ర పర్యటక శాఖ కార్యదర్శి వి విద్యావతి, రాకేష్‌కుమార్‌వర్మలకు వినతిపత్రం సమర్పించినట్లు శుక్రవారం తెలిపారు. మొలంగూర్ ఖిల్లా ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు బొంగోని అభిలాష్‌గౌడ్, చంద్రకాంత్ తదితరులు పాల్గన్నారు.

తాళం వేసి ఉన్న మూడిళ్లలో చోరీ

- ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 27 వేల నగదు అపహరణ



పరిశీలిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట, ఫిబ్రవరి 9: తాళం వేసి ఉన్న ఇండ్లే టార్గెట్ చేసి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడుతున్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో మూడిళ్లకు తాళం వేసి ఉండడంతో ఆ ఇళ్లలో చోరీకి పాల్పడి ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 27 వేల నగదును అపహరించారు. గ్రామానికి చెందిన బోనాల నర్సయ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 25 వేల నగదును దోచుకెళ్లారు. కాగా తాళం వేసి ఉన్న గుమ్మడిదారి గౌరవ్వ ఇంట్లో రెండు వేల రూపాయలు నగదు, అలాగే మరో ఇంట్లో కూడా ఇదే విధంగా చోరీకి పాల్పడ్డారు. ఈ ఇంట్లో ఏమి దొరకకపోవడంతో వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై అంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి గ్రామానికి చేరుకొని చోరీకి పాల్పడిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు: తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్ కతాకు చెందిన బాలుడు కిషన్‌కుమార్(12)ను చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా జిల్లా బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యుసీ) ఆధ్వర్యంలో అతని తల్లిదండ్రులకు అప్పగిం చారు. ఈ నెల 3న కరీంనగర్ ఫిష్‌మార్కెట్‌లో కిషన్‌కుమార్(12) అనే బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఒకటో ఠాణా పోలీసులు గుర్తించి వివరాలు సేకరించారు. సరైన సమాధానం రాకపోవటంతో సీడబ్ల్యుసీ ద్వారా ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్‌లో ఉంచారు. ఓపెన్ షెల్టర్ హోం సిబ్బంది బాలుడి వివరాలను అడగగా తనది పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కత్తా అని చెప్పడంతో వెంటనే సీడబ్ల్యూసీ అధికారులు వివరాలు సేకరించి బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలుడి తల్లిదండ్రులు శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుని వారి కొడుకు ఆధారాలు చూపడంతో వారికి అప్పగించారు. బాలుడు కోల్‌కతాలో 4వ తరగతి వరకు చదివి కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో గొడవల కారణంగా చదువు మానేశాడు. ఫిబ్రవరిలో తన అమ్మమ్మతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న దగ్గరి బంధువుల వద్దకు రైల్‌లో వస్తుండగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయాడు. తప్పిపోయిన బాలుడు చివరకు కరీంనగర్‌కు చేరుకున్నాడు. బాలుడు తెలిపిన వివరాలతో బాలల సంక్షేమ సమితి అధికారులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యుసీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, అర్చన, రాధ, విజయ్, చైల్డ్‌హెల్ప్ లైన్ 1098కు చెందిన సాయికిరణ్, ప్రియాంక, స్వప్న పాల్గొన్నారు.

రాజన్నపేటలో శిలాఫలకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించిన ప్రగతి ప్రాంగణం శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, సురేందర్ తదితరులు ఉన్నారు.

● కేసు నమోదు..

రాజన్నపేటలోని ప్రగతి ప్రాంగణం శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులోని ప్రగతి ప్రాంగణం శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో రూ.20వేల నష్టం వాటిల్లిందని పేర్కొంటూ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న గోసికంటి రవి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

నేడే నవోదయ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

చొప్పదండి, ఫిబ్రవరి 9: నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీచేసేందుకు శనివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మంగతాయరు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,745 మంది విద్యార్థులు 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1144 మంది విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరి కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు.

రాజన్న ఆలయంలో దొంగ చేతివాటం

- చితకబాదిన భక్తులు



యాత్రికులకు నగదు తిరిగి అందజేస్తున్న ఆలయ భద్రతా సిబ్బంది

వేములవాడ, ఫిబ్రవరి 9: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును దొంగిలించడానికి యత్నించిన ఓ వ్యక్తిని భక్తులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయ క్యూలైన్లో ఒక భక్తురాలి మెడలోంచి పుస్తెలతాడును అపహరించేందుకు యత్నించగా గుర్తించిన భక్తులు సదరు వ్యక్తిని పట్టుకుని చితకబాది ఆలయ భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా సదరు దొంగను విచారించిన క్రమంలో అంతకుముందు సదరు దొంగ మరో యాత్రికుడి వద్దనుంచి 5,000 రూపాయలను దొంగిలించినట్లు గుర్తించారు. 5,000 రూపాయలను భూపాల్‌పల్లి మండలానికి చెందిన సంతోష్ అనే భక్తుడి వద్ద దొంగలించినట్లు గుర్తించి ఆ సొమ్మును ఆలయ భద్రతా సిబ్బంది అతనికి తిరిగి అందజేశారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి కరీంనగర్ సమీపంలోని చింతకుంటగా గుర్తించామన్నారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించామని ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

శంకరపట్నం, ఫిబ్రవరి 9: మండలంలోని మొలంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శివకుమారి అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇల్లు పర్మిషన్ ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి మమత వేధిస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీవాణిని వివరణ కోరగా ఇంటి నిర్మాణానికి సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేనందున పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



రాంచందర్ (ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 9: మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామాని కి చెందిన కొర్వి రాంచందర్(36) అనే యువకుడు పెళ్లికావడం లేదనే మనస్తాపంతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్వి రాంచందర్ తనకు సరైన జీవనోపాధి లేకపోవడంతో పెళ్లి చేసుకోలేదు. సంవత్సరం క్రితం కరీంనగర్ ఫ్యామిలీ కోర్టులో అటెండర్‌గా ఉద్యోగం రావడంతో విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగం చేస్తున్నా తనకు పెళ్లి కుదరడం లేదని రెండు నెలలుగా విధులకు వెళ్లకుండా మనస్తాపానికి గురై గురువారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకు తరచూ పెళ్లికావడం లేదని బాధపడుతుండే వాడని దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి కొర్వి సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ..

శంకరపట్నం, ఫిబ్రవరి 9: మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన మహ్మద్‌గౌస్ (32) అనే యువకుడు గురువారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లికి చెందిన గౌస్ శంకరపట్నం మండలం కరీంపేటకు చెందిన కరిష్మాను వివాహం చేసుకొని కరీంపేటలోనే కూలీ పనులు చేసుకుంటూ భార్యా పిల్లలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి తాగుడుకు బానిసై కూలీ డబ్బులు తాగుడికే ఖర్చు చేసేవాడు. కుటుంబ బాధ్యతలు పట్టించుకునే వాడు కాదు. గురువారం మృతుడు గౌస్ తన భార్యతో అమ్మమ్మ, తాత దగ్గరికి వెళ్తున్నానని చెప్పి కరీంపేట గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కరిష్మా, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. మృతుడి భార్య కరిష్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామంలోని యువకులు చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో ఇటీవల నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం ఖాళీ స్థలంలో గొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజు టీ కొట్టు నడుపుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. టీ కొట్టు చుట్టు రేకులు అమర్చుకోవడం కోసం బండ రాళ్లు పేర్చుతుండగా మండల కేంద్రానికి చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి, సందుపట్ల పద్మారెడ్డి, మోగి ఆగయ్య ఖాళీ స్థలం తమదని పేర్కొంటూ ఇటీవల కులం పేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఘటన స్థలంలో ఇరువర్గాలను విచారించారు. వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. నిజనిర్ధారణ చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ ఉన్నారు.

రేపు గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 9: హైదరాబాద్‌కు చెందిన విష్ణు ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11న గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను తెలియజేశారు. స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు తెలంగాణ గ్రూపు-1 ఆఫీసర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నూతనకంటి వెంకట్, విన్నర్ పబ్లికేషన్ డైరెక్టర్ ప్రసన్న హరికృష్ణ, విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విష్ణువర్ధన్, జిల్లా ట్రెజరీ అధికారి ఎన్ నవీన్‌కుమార్ పాల్గొని పరీక్షల తీరు ప్రక్రియను పూర్తిస్థాయిలో వివరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 9: ఎస్‌యూ పరిధిలోని డిగ్రీ డిజైన్ టెక్నాలజీ, హానర్స్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను www.Satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

కరీంనగర్‌లో పీవీ విగ్రహం ఏర్పాటు చేస్తాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 9: భారతదేశ మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, తెలుగుబిడ్డ పి వెంకటనర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం హర్షనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా బిడ్డగా మనమందరం గర్వించదగిన విషయమన్నారు. తెలుగు ప్రజలకు అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్‌లో పీవీ నర్సింహారావు విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.

● సుభాష్‌నగర్: పీవీ నరసింహరావు దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు భారతరత్న ప్రకటించడంపై యావత్ తెలుగు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని రైతు, ప్రజా సంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు బిర్లా విద్యార్థులు



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన బిర్లా విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి9: కరీంనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వేద్ లహోటి (గ్రేడ్2) అధ్యాప్రదాయిని (గ్రేడ్2), సరయు (గ్రేడ్4), అద్యా (గ్రేడ్5) వశిష్ట్ (గ్రేడ్5) శ్రీహాస్ (గ్రేడ్6) ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 10వ తేదీన భద్రాద్రి కొత్తగూడెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలల్లో పాల్గొననున్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్ కోచ్ గౌతం, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్, అనిల్, జీవన్, సాయికిరణ్, కావేరి, దీక్ష తదితరులు పాల్గొన్నారు.

చామనపల్లి నర్సరీని పరిశీలించిన కలెక్టర్


చామనపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 9: కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలోని నర్సరీని కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, కంపోస్ట్ షెడ్డును పరిశీలించి నిర్వహణ గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, డీఆర్‌డీఓ శ్రీలత, ఎంపిడిఓ దివ్యదర్శన్‌రావు అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: కొత్తపల్లిలోని మహాత్మా జ్యోతిభాపూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం సైబర్ క్రైం పోలీసులు విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం సీఐ సునీల్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత సామాజిక మాధ్యమాల మోజులో నిత్యం చాటింగ్‌లు చేస్తూ ఓటీపీలు చెప్పి మోసపోతున్నారని అన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్‌లకు, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఎస్ఐ జ్యోస్న, కానిస్టేబుల్ వసీం అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో కేన్సర్‌పై అవగాహన

సుభాష్‌నగర్,ఫిబ్రవరి 9: మంకమ్మతోటలోని శ్రీ చైతన్య డిగ్రీ, పిజీ కళాశాలలో మహిళా అధ్యాపకులకు, విద్యార్థినులకు శుక్రవారం కేన్సర్‌పై అవగాహన శిబిరం నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చల్మెడ ఆనందరావు హాస్పిటల్ క్లినికల్ అండ్ రేడియేషన్ అంకాలోజిస్ట్ డాక్టర్ ఈ రవిందర్, సర్జికల్ అంకాలోజిస్ట్ డా. డి ప్రశాంత్ కేన్సర్ వ్యాధి లక్షణాలు, ప్రాథమిక నిర్ధారణ, చికిత్స గురించి తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న జీవన విధానాలు, వాతావరణ కాలుష్యం కేన్సర్ వ్యాధికి ముఖ్య కారణంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణారెడ్డి, మహిళా సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మెరుగైన నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9: విద్యార్థులు మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, మెరుగైన నైపుణ్యాలు ఉన్న విద్యార్థులు దేశానికి ఎంతో అవసరమని వరంగల్ కాకతీయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన అవుట్ కంబెస్ట్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు అన్ని రకాల స్కిల్స్‌పై పట్టు ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, హ్యుమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి. రాజేశ్వర్‌రావు, ఐక్యూ ఏసీ ఇంటర్నల్ క్వాలిటీ అష్యురెన్స్ సెల్ ఇంచార్జీ ప్రొఫెసర్ అండ్ డీన్ డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, వివిధ విభాగాధిపతులు తదితరులు ఉన్నారు.

రెండో విడత దళితబంధు అమలు చేయాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 9: రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బి రామస్వామి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో నాలుగువేల కుటుంబాలకు దళితబంధు రెండో విడత డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కోసం పాడి కౌశిక్‌రెడ్డి రెండో విడత డబ్బులు రాకుండా అడ్డుకున్నారన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత దళిత కుటుంబాల దగ్గరకు వెళ్లి సానుభూతి వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎం రవీందర్, మహేందర్, కుమార్ యాదవ్, సమ్మయ్య, శ్రీనివాస్, దిలీప్, నరేష్, అజయ్, రాము, శ్రీనివాస్, రంజిత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: రెండో విడత దళిత బంధు రుణాలు పార్లమెంట్ ఎన్నికల ముందే అందించాలని దళితబంధు రెండో విడత బాధితుల సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నియోజకవర్గంలో రెండోవిడత రాని కుటుంబాలు 4,900 మంది ఉన్నారన్నారు. వ్యాపారల కోసం అప్పులు చేసిన లబ్ధిదారులు ఇబ్బందులకు గురవవుతున్నారన్నారు. సీఎంవో కార్యాలయనికి 4,900 లబ్ధిదారులు స్పీడు పోస్టు ద్వారా ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జత చేసి లేఖలు పంపాలని నిర్ణయించారు.

సృజనాత్మకత ఉంటేనే జీవితంలో రాణించవచ్చు


విద్యార్థినిని అభినందిస్తున్న శేఖర్‌రావు

రామడుగు, ఫిబ్రవరి 9: నేటి ఆధునిక ప్రపంచంలో సృజనాత్మకత ఉంటేనే జీవితంలో రాణించవచ్చని ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ ఇంటర్ స్కూల్ కాంపిటేషన్‌లో మండలంలోని వెలిచాల సరస్వతి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు అబాకస్, వేదిక మ్యాథ్స్ దోహదం చేస్తాయన్నారు.

జూనియర్స్ లెవల్ 1లో రాచమల్ల నవనీత ఉమ్మడి జిల్లా టాపర్‌గా, స్టార్ జూనియర్ కన్సోలేషన్ విభాగంలో సిరిపురం సాయిచరణ్, మేకల భవిష్య, సీనియర్స్ విభాగంలో రేగూరి మనస్వి, భైరగోని సుహాని, పెద్ది సిరి నిలవగా వారికి నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎచ్ఎం ఉప్పుల శ్రీనివాస్, కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, ట్రస్మా మండల అధ్యక్షుడు పంజాల జగన్మోహన్‌రెడ్డి, అడ్వకేట్ చామనపల్లి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం నిర్లక్ష్య ధోరణి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలోని సీపీఎం ప్రభుత్వంపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సీపీఎం కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌక్ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రాలకు రావలసిన నిధుల కేటాయింపులో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని అన్నారు. కేరళలో సిపిఎం ప్రభుత్వంపై గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని పెత్తనం చెలాయించాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వాలను కూల్చాలని కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కేరళ రాష్ట్రంలో అనేక వరదలు వచ్చి కోట్లాది రూపాయల ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరిగినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వకుండా వివక్షగా వ్యవహరించిందని అన్నారు. దేశంలోనే కరోనాను అరికట్టిన రాష్ట్రంగా పేరొందిన కేరళను విస్మరిస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి అన్ని రాష్ట్రాలను సమానంగా చూడవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అలా వ్యవహరించకుండా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సిబిఐ, ఈడి సంస్థలను వాడుకుంటూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. రాష్ట్రాలకు రావాల్సిన వాటాను మంజూరు చేయడం లేదన్నారు. ప్రజల కష్టార్జితంతో చెమటోడ్చి కట్టిన పన్నులను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతూ కార్పొరేట్ శక్తులకు కేంద్రం ఊడిగం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం,జిల్లా కమిటీ సభ్యులు నరేష్ పటేల్, నాయకులు జి తిరుపతి, రాయికంటి శ్రీనివాస్, పున్నం రవి, తిప్పారపు సురేష్, కవంపల్లి అజయ్,రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 9: సీబీఎస్ఈ ఎక్స్‌ప్రెషన్ సీరిస్‌లో సెయింట్‌జార్జ్ విద్యార్థి రక్షిత్ ప్రతిభ చాటి మెరిట్ సర్టిఫికెట్ సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి విద్యార్థిని అభినందించారు. సెంట్రల్‌బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీబీఎస్ఈ ఎక్స్‌ప్రెషన్ సీరిస్‌లో పెయింట్ విభాగంలో ఇకో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై జాతీయస్థాయిలో మెరిట్ సాధించాడు.

ఘనంగా స్వాగతోత్సవం

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 9 : ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల కరీంనగర్ జంతుశాస్త్రం విభాగం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు స్వాగతోత్సవం ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ జంతుశాస్త్ర విద్యార్థులు పరిశోధన వైపు ఆలోచన చేయాలని అన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగ అధిపతి లెఫ్టినెంట్ పర్లపల్లి రాజు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద'లో ఘనంగా పరివర్తన్ సంబరాలు



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి , నృత్యం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9: నగరంలోని జగిత్యాలరోడ్ వివేకానంద రెసిడెన్షియల్ సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుక పరివర్తన్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డాక్టర్ రఘురామన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, పాఠశాల పూర్వ విద్యార్థిని సుచరితరెడ్డి హాజరయ్యారు. పాఠశాల సెక్రటరీ రమాదేవి పొల్సాని, ఛైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు పొల్సాని, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి.లలితాకుమారి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రేణుక బలివాడతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యత పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సమ్మక్క-సారలమ్మ జాతర విశిష్టతను తెలిపే విధంగా విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9: ప్రాణాలను పణంగా పెట్టి స్వరాష్ట్రం సాధించుకొని తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగించిన బీఆర్ఎస్ కేసులకు భయపడదని, ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసినందుకు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి ఏనుగు రవీందర్‌రెడ్డి, భూక్యాతిరుపతినాయక్, జక్కుల నాగరాజు, కెమసారం తిరుపతి, ద్యావ మధుసూధన్‌రెడ్డి, ఆరెపల్లి సాయికృష్ణలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో తెలంగాణ ఉద్యమం జరిగిన సందర్భంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులకు పాల్పడి ఉద్యమాన్ని అణచివేయాలని చూసిందన్నారు. అయినా కూడా భయపడలేదని, మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ తెచ్చిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చిన భాషలో మాట్లాడినందుకు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని అనచివేయాలని చూస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్చేవరకు పోరాడుతామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు


విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 9: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు అల్ఫోర్స్ కళాశాలకు చెరందిన నిఖిల్‌సింగ్ సోహన్, జి మనిచందు, సిహెచ్ శ్రీధర్‌రెడ్డి, పి మణికంఠరెడ్డి, ఎస్ముకేష్‌లు అండర్ 19 విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటించడంపై సంబరాలు


హుజూరాబాద్‌లో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించడంపై ఆయన బంధువులు సంబరాలు నిర్వహించారు. నగరంలోని సీవీఆర్ఎన్ కాలనీలో టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పీవీ మేనకోడలు సుభాషిణి మాట్లాడుతూ కొంత ఆలస్యమైనా పీవీకి అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. సుభాషిణి భర్త కల్వకోట సంతోష్ బాబు కరీంనగర్‌లో పీవీ నరసింహారావు పేరిటి పీవీ సాహిత్య పీఠం అనే సంస్థను నడుపుతున్నారు.

కరీంనగర్ రూరల్: పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడంపై బీజేపీ నాయకులు రేకుర్తి అంబేద్కర్ కూడలిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణరెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదారపు విద్యాసాగర్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగుల వెంకటేష్‌గౌడ్, రామడుగు మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సంటి జితేందర్, బూత్ అధ్యక్షుడు దయ్యాల మల్లేశం, బుర్ర సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడాన్ని హర్షిస్తూ శుక్రవారం బీజేపీ, పీవీ జిల్లా సాధన సమితి నాయకులు హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. అలాగే పీవీ మదన్‌మోహన్‌రావు, బెల్లి రాజయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణసంచాలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సైదాపూర్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పీవీ నర్సింహారావుకు ప్రాముఖ్యాన్ని గుర్తించి మోదీ భారతరత్న ప్రకటించడం అభినందనీయమన్నారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు బిల్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ సర్పంచ్ కాయిత రాములు, సింగిల్ విండో డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: ఆర్థిక సంస్కరణలో కీలక భూమిక పోషించిన స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్నం ప్రకటించడం హర్షణీయమని పీవీ ట్రస్ట్ సేవా అధ్యక్షుడు బెల్లి రాజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశాభివృద్ధికి పీవీ చేసిన సేవలను ప్రధాని నరేంద్రమోదీ గుర్తించి భారత రత్న ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

సైదాపూర్, ఫిబ్రవరి 9: గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లిలో ముత్యాల గాంధీయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ క్రికెట్ ఆడుతూ క్రీడాకారులకు ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, పేరాల గోపాల్‌రావు, సింగిల్ విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

చొప్పదండి, ఫిబ్రవరి 9: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11,12 తేదీలలో ఖమ్మంలో జరిగే రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి యామ తిరుపతి కోరారు. శుక్రవారం చొప్పదండి జడ్పీ బాలికల పాఠశాలలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, నాయకులు కోట రమాస్వామి, ప్రధానోపాయద్యాయుడు జంగం శ్రీనివాస్, ముకుందరెడ్డి, మహేశ్, ముద్దసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

చిగురుమామిడి, ఫిబ్రవరి 9: బాలికలు ఉన్నతమైన విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీవో సబితకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్నేహిత కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతు ప్రభుత్వం అందించే అన్ని పథకాలను వినియోగించుకొని ఉన్నత విద్యను చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, అంగన్ వాడీ సిబ్బంది, సీఏలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఆడపిల్లలపై జరిగే లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని మల్యాల పాఠశాలలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, పద్మ, రాజేష్‌బాబు, అశోక్, సరోజ, రవీందర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి 1008 కలశాలతో అభిషేకం


పూజలు నిర్వహిస్తున్న పండితులు

వీణవంక ఫిబ్రవరి 9: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలోని వేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నమిలికొండ రమణచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 64 రకాల దివ్య ఔషధాలతో ఏడు నదుల జలాలతో పంచామృతాలతో 1008 కలశాలతో అభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవాని ఆలయంలో పూజలు

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 9: శైశిర నవరాత్రోత్సవాల్లో భాగంగా నగునూరులోని శ్రీ దుర్గా భవాని దేవాలయంలో అమ్మవారికి ఫలపంచామృతాభిషేకం కార్యమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పవనకృష్ణ శర్మ, పూజారులు, ఆలయ ఫౌండర్ ఛైర్మన్ వంగలలక్ష్మణ్ పాల్గొన్నారు.

పరామర్శ

భగత్‌నగర్, ఫిబ్రవరి 9: సామాజిక ఉద్యమ నాయకుడు సీపీఐ మాజీ నాయకుడు బుర్ర కొండయ్యను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యేచాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు. బొమ్మకల్‌లోని చల్మెడ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న కొండయ్యను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బూడిద సదాశివ తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్

భగత్‌నగర్,ఫిబ్రవరి9: ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్‌బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వ రైతు, వ్యవసాయ కార్మికవ్యతిరేక విధానాలను నిరసిస్తూ గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

క్రమశిక్షణతో నడుచుకోవాలి

గణేశ్‌నగర్,ఫిబ్రవరి9: క్రమశిక్షణతో కూడిన చదువు విజయానికి సోపానం అవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు కుర్రే తిరుపతి అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీసీస్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ విద్యార్థుల కోసం నిర్వహించిన విజయదీపిక కార్యక్రమంలో భాగంగా ప్రసంగించారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, రాజేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్‌ను పీవీ జిల్లాగా ప్రకటించాలి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 9: ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరిట కరీంనగర్ జిల్లాను పీవీ జిల్లాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని తెలంగాణ గ్రంథాలయ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

● గణేశ్‌నగర్: ఎస్ఆర్ఆర్ కళాశాల అభివృద్ధికి కృషి చేసిన మాజీ భారత ప్రధాని, బహు భాషావేత్త పీవీ నరసింహారావుకు భారతరత్న రావడం పట్ల గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సురేందర్‌రెడ్డి , డాక్టర్ మల్లారెడ్డి, శ్రీనివాస్, రాజు, వైస్ ప్రిన్సిపల్స్ రాజయ్య, డాక్టర్ రాజేంద్రమ్, డాక్టర్ ఎస్ ఓ కుమార్, డాక్టర్ పురుషోత్తం, సుధాకర్, ప్రమోద్, వివిధ విభాగాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు.

యజ్ఞవరాహక్షేత్రంలో సుదర్శన హోమం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి9: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శుక్రవారం సుదర్శన మూలమంత్ర సహిత శతక, నారసింహ, యజ్ఞవరాహ మంత్రాలతో సుదర్శన హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీభాష్యం వరప్రసాద్ భక్తులు పాల్గొన్నారు.

రేపు 'కదలిక' సాహిత్య వ్యాసాల పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 9: నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రచయిత, చేనేత-జౌళి శాఖ విశ్రాంత ఉపసంచాలకుడు కందుకూరి అంజయ్య రచించిన 'కదలిక' సాహిత్య వ్యాసాల పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, అతిథులుగా గాజోజు నాగభూషణం, బూర్ల వేంకటేశ్వర్లు హాజరవుతారని పేర్కొన్నారు. పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు అంకితమిస్తారని, పుప్పాల శ్రీరాం పుస్తక పరిచయం చేస్తారని తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు తగ్గించాలని మండలంలోని పెద్దపాపయ్యపల్లిలో సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులు చేతి సంచులను వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

కలుపు మందులపై అవగాహన

హుజూరాబాద్, ఫిబ్రవరి 9: మండలంలోని సిర్సపల్లిలో వరిలో నూతనంగా తయారు చేసిన కలుపు మందులపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎంసీ కంపెనీకి చెందిన శాస్త్రవేత్త రవీందర్‌రావు పొలంలో రైతులకు క్షేత్రప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సురేంద్ర, నరేష్, తూముల చక్రధర్‌రావు, బల్లు పున్నంచందర్ పాల్గొన్నారు.

క్షేత్ర సందర్శన

గంగాధర, ఫిబ్రవరి 9: మండలంలోని ఒద్యారంలో ఏవో రాజు ఆధ్వర్యంలో పంట క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న పంటల్లో ఆశించిన తెగుళ్లు, చీడపీడల నివారణకు తగిన సూచనలందించారు. ఏఈవో అనంతరాజు, రైతులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

శంకరపట్నం, ఫిబ్రవరి 9: ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ వద్ద సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెలో సీఐటీయూతో పాటు 97 కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్‌డీ బాబా, నాయకులు ఎల్కపల్లి సారయ్య, వంగ బిక్షపతి, రమేష్, చక్రపాణి, అంజయ్య, మహేందర్, జనార్దన్ పాల్గొన్నారు.

స్వీట్ల పంపిణీ

హుజూరాబాద్, ఫిబ్రవరి 9: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్-మృణాళిని దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని శుక్రవారం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

మానకొండూర్: మానకొండూర్‌లోని జమియా మజీద్ కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ శర్ఫోద్దీన్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

రామడుగు: మండలంలోని రుద్రారంలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి, మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కట్ట రవిం దర్, కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిట్టవేణి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.